



మహబూబాబాద్ నిజాం చెరువులో వినాయక విగ్రహం నిమజ్జనం



మహబూబాబాద్‌లో నిమజ్జనం చేసేందుకు తీసుకువెళ్తున్న వినాయక విగ్రహం

బైబై గణేషా

గంగమ్మ చెంతకు గణనాథుడు

- జిల్లా వ్యాప్తంగా విఘ్నేశ్వరుడి నిమజ్జనం
- మానుకోటలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు
- రాత్రి పొద్దు పోయేంత వరకు నిజాం చెరువులో నిమజ్జనం
- మానుకోట, మరిపెడ, తొర్రూరులో ఎస్పీ పర్యవేక్షణ
- ముగిసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భక్తులచే నవరాత్రులు పూజలుందుకున్న గణనాథుల గంగమ్మ చెంతకు చేరాయి. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినం రోజున మండపాల్లో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కొలువుదీరిన వినాయక విగ్రహాల వద్ద భక్తులు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. మానుకోట పట్టణంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో శుక్రవారం వినాయక నిమజ్జనం చేశారు. అన్ని చెరువుల వద్ద అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయగా ఉత్సవకమిటీ నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను ఉంచి ఊరేగింపుగా తీసుకువెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు. తొలుత మండపాల వద్ద అడ్డు వేలం పాటలు నిర్వహించగా భక్తులు దక్కించుకున్నారు.



కురవి పెద్ద చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న యువకులు



మహబూబాబాద్‌లో వినాయక విగ్రహంతో ఎమ్మెల్యే మురళీనాయక్

స్వాగత వేదిక వద్ద ప్రత్యేక పూజలు..

జిల్లా కేంద్రంలో ఫారెస్టు సెంటర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు స్వాగత వేదిక వద్ద వినాయక విగ్రహాలకు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. నారికేళం సమర్పించి, అక్కడ నుంచి నిజాం చెరువుకు సాగనంపారు. కొత్త బజారులోని విగ్రహాలు మూడుకొట్ల సెంటర్, తహసీల్ సెంటర్, నెహ్రూ సెంటర్, ఆర్యూబీ మీదుగా ఆర్వోబీ గుండా, జ్యోతిబాపూలే విగ్రహం, వ్యవసాయ మార్కెట్ సెంటర్, మదర్ థెరిస్సా సెంటర్ నుంచి స్వాగత వేదిక వద్దకు చేరుకోగా అక్కడ పూజలనంతరం వివేకానంద సెంటర్ మీదుగా నిజాం చెరువుకు వద్దకు వెళ్లాయి. పాత బజారులోని విగ్రహాలు సైతం వేదిక వద్దకు వచ్చి పూజలనంతరం నిజాం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్, డీఈ ఉపేందర్, విద్యుత్ డీఈ విజయ్‌కుమార్, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు, మరిపెడ, తొర్రూరు, ఇనుగుర్తిలో నిమజ్జన కార్యక్రమాన్ని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ పర్యవేక్షించారు.

వాహనం వెంట ఇద్దరికి అనుమతి..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద నిజాం చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిజాం చెరువు వద్ద బారీకేడ్లను ఏర్పాటు చేసి, వాహనం వెంట ఉత్సవ నిర్వాహకులను ఇద్దరిని మాత్రమే అనుమతించారు. చెరువు వద్ద మునిసిపల్ సిబ్బంది వినాయక విగ్రహాలను క్రేన్, పడవ ద్వారా చెరువులో నిమజ్జనం చేశారు. మానుకోట పట్టణంలో ఏర్పాటు చేసిన 210 విగ్రహాలను నిజాం చెరువులో సాయంత్రం నుంచి రాత్రి పొద్దు పోయేంత వరకు (మిగతా 8లో..)



మహబూబాబాద్‌లో నిమజ్జనం చేసేందుకు తీసుకువెళ్తున్న వినాయక విగ్రహం



కేసముద్రం మండలం కల్వలలో వినాయక నిమజ్జనం చేస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు



మహబూబాబాద్ నిజాం చెరువు వద్ద పడవలో వినాయక విగ్రహంతో ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు



గూడూరు అరవింద విద్యాలయంలో నిమజ్జన వేడుకలో పాల్గొన్న సీఐ సూర్యప్రకాష్



మాకుల పెద్ద చెరువు ఘట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మరిపెడలో వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకున్న పద్మశాలి సంఘ బాధ్యులు



తొర్రూరు పెద్ద చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్



హైదరాబాద్‌లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ యోగితారాణా, దేవసేన, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న కేయూ ప్రొఫెసర్ ప్రసాద్, అరుణ, సునిత, తిరుపతి, లింగయ్య

కనులపండువగా..

- రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం
- హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ నుంచి ఐదుగురికి సత్కారం

హైదరాబాద్‌లోని శిల్పాకళా వేదిక ప్రాంగణంలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల అవార్డుల ప్రదానోత్సవం కన్నుల పండుగా జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఐదుగురికి సత్కారం జరిగింది. కేయూలోని ఫార్మసీ ప్రొఫెసర్ ఎన్. ప్రసాద్, హనుమకొండ పింగళి మహిళ కళాశాల రసాయనశాస్త్ర విభాగాధిపతి అరుణ, మహబూబాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు రాదారపు సునీత, భూపాలపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోండ్ర తిరుపతి, చిట్యాల మండలంలోని జడల్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నూకల లింగయ్యలు అవార్డులు అందుకున్నారు.

- కేయూ క్యాంపస్/భూపాలపల్లిటౌన్/చిట్యాల/మహబూబాబాద్ ఎడ్యుకేషన్

ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలు



సన్మాన సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్ సింగ్

- నూతన సాంకేతికతను అలవర్చుకొని బోధన చేయాలి
- దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య రూపుదిద్దుకుంటుంది
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

8

రైతుకు విత్తన హక్కు కావాలి

- హరిత విప్లవం మాటున రసాయన ఎరువుల ప్రవేశం
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి



తాళ్లపూసపల్లి సభలో మాట్లాడుతున్న కోదండరెడ్డి

కేసముద్రం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతుకు తాను సాగు చేస్తున్న భూమిపై హక్కుతోపాటు, విత్తన హక్కు కూడా ఉండాలని రాష్ట్ర వ్యవసాయం, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో శుక్రవారం అభినవ్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ శిక్షణ, బయో ఇన్‌పుట్ రీసెర్చ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల ప్రవేశంతో రైతులకు విత్తనాలపై హక్కు కూడా లేకుండా పోయిందని ఆ వేదన వ్యక్తం చేశారు. విత్తన హక్కు చట్టం వస్తే విత్తనాలను భద్రపర్చుకోవడం, ఉపయోగించడం, మార్చుకోవడం, పంచుకోవడంపై రైతులకే హక్కు ఉంటుందని తెలిపారు. కలుపు నివారణ కోసం వాడే గ్లైఫోసెట్ మందు వల్ల భూమి విపరీతంగా నష్టపోతోందని, హెచ్‌టీబీ పత్తి విత్తనాలు నిషేధం ఉన్నప్పటికీ కోట్ల రూపాయల విత్తనాలు దొంగతనంగా అమ్ముడు పోతున్నాయని తెలిపారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న హయాంలో ఆహారకొరత ఉండడంతో అమలు చేసిన హరిత విప్లవాన్ని ఆసరా చేసుకొని రసాయన ఎరువుల కంపెనీలు దేశంలోకి చొరబడి విపరీతంగా వాడేలా చేసి భూమిని విషంగా మార్చాయని తెలిపారు. వ్యవసాయంలో పెనుమార్పులు తీసుకురావాలని రైతు సంక్షేమమే ధ్యేయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ కమీషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు.

యూరియా విక్రయాల్లో వ్యాపారుల దగా..!?

- బస్తాపై రూ.200 అదనంగా వసూలు
- పంపిణీలోనూ వివక్షత

బయ్యారం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల అవసరాలను పసిగట్టిన పలువురు ఎరువుల వ్యాపారులు యూరియా విక్రయాల్లో దగాకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అంతేకాక సరఫరాలోనూ వివక్షత చూపుతున్నట్లు సమాచారం. దీంతో అసహనంతో పలువురు రైతులు వ్యాపారులపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం. బయ్యారం మండలంలోని ఓ రెండు ఫర్టిలైజర్ షాపులకు 400 బస్తాల యూరియా దిగుమతైంది. దీంతో సంబంధిత వ్యాపారులు గురువారం టోకెన్ పద్ధతిలో రైతులకు యూరియాను సరఫరా చేశారు. టోకెన్ తీసుకున్న రైతులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్కో యూరియా బస్తా రూ. 300ల చొప్పున విక్రయించిన వ్యాపారులు, రాత్రి రూ. 500లకు పెంచినట్లు సమాచారం. రాత్రి పొద్దుపోయిన తరువాత ధరను అమాంతం పెంచటంపై రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఒక్క యూరియా బస్తాపై రూ. 200 అదనంగా వసూలు చేయటంపై రైతులు ప్రశ్నించటంతో పంపిణీ కేంద్రం వద్ద అలజడి నెలకొన్నట్లు సమాచారం. దీంతో వ్యాపారితో రైతులు వాగ్వాదానికి దిగగా వ్యాపారి విక్రయ సరఫరాను నిలిపివేసినట్లు తెలిసింది. అంతేకాక యూరియా సరఫరలో కూడా వ్యాపారులు వివక్షచూపినట్లు సమాచారం. తమ షాపు వద్ద పురుగు మందులు కొన్న ఖాతాదారులకే తొలి ప్రాధాన్యత ఇస్తూ, యూరియా సరఫరా చేసినట్లు (మిగతా 8లో..)



అనుమానాస్పద స్థితిలో
యువకుడి మృతి
కారులో మృతదేహం లభ్యంపై అనుమానాలు



రాంబాబు(ఫైల్), మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ పట్టణంలోని నర్సంపేట బైపాస్ గాయత్రి గుట్ట సమీపంలో చోటు చేసుకుంది. ఎన్‌హెచ్-365 ప్రధాన రహదారి పక్కన ఆగి ఉన్న కారులో మృత దేహం లభ్యం కావడంతో హత్యా.. ఆత్మహత్య అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. మహబూబాబాద్ టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. కురవి మండలం తాట్యాతండాకు చెందిన భూక్య రాంబాబు (28) కొంతకాలంగా జిల్లా కేంద్రంలోని ఓ వ్యాపారి వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తల్లిదండ్రులతో కలిసి మహబూబాబాద్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. డ్యూటీకి వెళ్లోస్తానని తన బావకు చెందిన కారును తీసుకొని ఈ నెల 4 ఉదయం ఇంటి నుంచి బయలు దేరాడు. అదేరోజు అర్ధరాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో మా గ్రామానికి చెందిన అన్నకొడుకు భూక్య రమేష్ బొద్దుగొండకు వెళ్లే క్రమంలో పట్టణంలోని గాయత్రి గుట్ట దగ్గరలోని కంకరమిల్లు తండా దగ్గర రోడ్డు పక్కన ఆగిఉన్న కారును గమనించి అనుమానం వచ్చి కారు దగ్గరకు వెళ్లి చూడగా రాంబాబు కారు ముందు సీటులో మృతి చెంది ఉన్నాడు. విషయం గమనించి బందువుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. డ్యూటీకి వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలు దేరిన రాంబాబు గాయత్రి గుట్ట సమీపంలో కారులో మృతి చెంది ఉండడంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హత్యా.. ఆత్మహత్యనా అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉన్నది. మృతుని తండ్రి భూక్య కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు


బచ్చల రవి (ఫైల్)

బయ్యారం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు వాగులో గల్లంతైన వ్యక్తి మృతి చెందగా, శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పందెం గ్రామానికి చెందిన బచ్చల రవి (38) రోజువారి మాదిరిగానే ఈ నెల 3వ తేదీ మంగళవారం సాయంత్రం వ్యవసాయ పనుల నిమిత్తం చేనుకు వెళ్లాడు. అనంతరం రవి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికినప్పటికి ఆచూకి లభ్యం కాలేదు. ఈ క్రమంలోనే శుక్రవారం పక్క చేను సుందర్‌కు సమీప ఉమ్మ లేరు వాగు చెట్ల పొదల్లో ఓ వ్యక్తి చిక్కుకొని ఉన్నట్లు కన్పించడంతో విషయాన్ని రవి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యుల పరిశీలనలో రవిగా నిర్ధారణ కాగా, రవి అప్పటికే చనిపోయినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుని భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా మద్యం మత్తులో వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు రవి మృతి చెందివుంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

తొర్రూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ కోసం బలమైన అడుగులు వేసి దేశాభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్న ప్రధాని మోదీ ఎర్రకోట బురుజులపై చెప్పిన మాటను నిజం చేసిన గొప్ప నేతని బీజేపీ పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్ అన్నారు. శుక్రవారం బస్టాండ్ సెంటర్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజలు వాడే వివిధ రకాల వస్తువులపై, నిత్యావసర సరుకులపై పన్నులు తగ్గించిన ఘనత దేశ చరిత్రలో ప్రధాని మోడీకే దక్కిందన్నారు. కాంగ్రెస్ నేతలకు మోదీని విమర్శించే అర్హత లేదన్నారు. మోదీతోనే దేశం అభ్యున్నతి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, పల్లె కుమార్, నవీన్, యాకయ్య, సంతోష్, అలిసేరి రవిబాబు, రామ్మూర్తి, సంపత్, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులే భావితరాల నిర్మాతలు

- ములుగు కలెక్టర్ దివాకర
- ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేత


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): భావితరాలను నిర్మించేది ఉపాధ్యాయులే.. విద్యార్థులను సన్మార్గంలో పెట్టి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. నైతిక విలువలతో కూడిన బోధన అందించడం ద్వారా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. ములుగు జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమన్నారు. విద్యార్థుల అభ్యున్నతికోసం శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులని తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 33 మందికి ఈ సందర్భంగా సన్మానంచేసి పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రేగ కల్యాణి, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థరెడ్డి, డీసీఈబీ కార్యదర్శి సూర్యనారాయణ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, కాటం మల్లారెడ్డి, గుల్లపల్లి సాంబయ్య, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కుట్రలు
సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన ఎంపీ బలరాం, ఎమ్మెల్యే మురళీనాయక్


సీఎం రేవంత్‌రెడ్డితో భేటి అయిన మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎంపీ బలరాంనాయక్

మహబూబాబాద్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ట్రైకార్ ఛైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ శుక్రవారం భేటీ అయ్యారు. ఇటీవల కాలంలో లంబాడలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కొంత మంది ఆదివాసీ ప్రతినిధులు సుప్రీంకోర్టుకు వెళ్లిన దరిమిలా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి లంబాడలను తొలగించేందుకు కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని తెలిపారు. స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి లంబాడలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ, గిరిజనులకు అండగా ఉంటుందని చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో లంబాడలు , ఆదివాసీలు అన్నదమ్ముల వలె ఐక మత్యంగా కలిసి మెలసి ఉండాలని సీఎం సూచించినట్లు వివరించారు.

వినాయక లడ్డూ వేలం రూ.45,116
దక్కించుకున్న ముస్లిం దంపతులు


లడ్డూను వేలం ద్వారా దక్కించుకున్న ముస్లిం దంపతులు రహిమొద్దీన్-రషీదాబేగం

మరిపెడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రుల ఉత్సావాలలో భాగంగా మరిపెడ బంగ్లాలోని రామాలయ వినాయక లడ్డూను స్థానిక స్టార్ ఏడీఎంఎస్ షోరూమ్ నిర్వాహకులైన ముస్లిం దంపతులు ఎస్కే.రహిమొద్దీన్-రషీదాబేగం వేలం పాట ద్వారా రూ.45,116కి దక్కించుకున్నారు. శుక్రవారం ఆ ఆలయ నిర్వాహకులు వినాయకుడి లడ్డూకు వేలం పాట నిర్వహించారు. పలువురు పోటీపడగా రహిమొద్దీన్-రషీదాబేగంలకు గణేశుడి లడ్డూ దక్కింది. ఈ దంపతులు కుల మతాలకతీతంగా సర్వమతాల కోసం తమ భక్తిభావం చాటుతుంటారు. పలువురు వారిని ప్రశంసించారు. కాగా, ఈ వినాయకుడి రెండో లడ్డూను గుమ్మడవెల్లి వెంకన్న రూ.6116కు, మూడో లడ్డను ఉల్లి శ్రీనివాస్ (థియేటర్) రూ.3116కు వేలంలో దక్కించుకున్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా మోదీ పాలన


మోదీ చిత్రటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దవంగర, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ పాలన సాగుతోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములు గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకోవడంతో మండల అధ్యక్షుడు కట్బోజు భాస్కరాచారి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ హయాంలో పేదలపై పన్నుల భారాన్ని మోపితే నేడు ప్రధాని నరేంద్ర మోదీ ఆ పన్నుల భారం నుంచి ఉపశమనం కలిగించారన్నారు. తాజాగా జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో పేద, మధ్య, తరగతి కుటుంబాలకు నేరుగా లాభం చేకురుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ జీఎస్టీ తగ్గింపుతో నిరుపేదల అభ్యున్నతికి మోదీ ప్రభుత్వం ఎంతటి నిబద్ధతతో ఉందో అర్థమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సామాన్యుడి రోజువారి అవసరాలు, ఆరోగ్య రంగానికి భారీ ఊరట లభించిందని కొనియాడారు. వ్యవసాయ కోత యాంత్రలు, విత్తనాలు, పరికరాలపై 12శాతం నుంచి ఐదు శాతానికి జీఎస్టీ తగ్గించడం ద్వారా వ్యవసాయ రంగంలో ఖర్చులు తగ్గి ఉత్పత్తి పెరిగేలా మోదీ నిర్ణయం తీసుకున్నారన్నారు. విద్యాపరమైన ఖర్చులు తగ్గేలా రూపకల్పన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సుధాకర్, రాము, సందీప్, సోమన్న, శ్రీను, శ్రీకాంత్, బాలు, అశోక్, సాంబరాజు, రాజు, కిరణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీల జోలికి వస్తే ఊరుకోం..


సమావేశానికి హాజరైన లంబాడీ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లంబాడీల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని లంబాడీల సంఘ నాయకులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, మాజీ కౌన్సిలర్ వాంకుడోతు అనిత హెచ్చరించారు. జనగామలోని ఓ ఫంక్షన్‌హాల్లో శుక్రవారం లంబాడీ సంఘ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ నాయకుడు సోయం బాబురావు బంజారులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టులో పిటీషన్ వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ హక్కులను భారత పార్లమెంట్‌ను అవమానపరుస్తున్న ఆ ఇద్దరు నాయకులను కాంగ్రెస్ నుంచి బహిష్కరించాలని, క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూక్య వాసు నాయక్, లకావత్ నరేశ్, జై సింగ్ రాథోడ్, జాటోత్ కిషన్, బానోత్ బన్సీ నాయక్, బానోత్ భిక్షపతి, కొర్ర కాలురామ్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ దక్కించుకున్న మంత్రి సీతక్క కోడలు


లడ్డూను ఎత్తుకున్న కుసుమాంజలి

కొత్తగూడ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడలో నిర్వహించిన వేలం పాటలో పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క కోడలు కుంజ కుసుమాంజలి సూర్య రూ, 41,000కు గణపతి లడ్డూను దక్కించుకున్నారు. జవహర్‌లాల్ యువజన సంఘం (జేఎల్ఎస్‌వైసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఈ పాటలో కుసుమాంజలి సూర్య, చెవ్వ రాంచందర్, బండి రాజమౌళి, జిమ్మిడి శ్రీనివాస్ పాల్గొన్నారు. సీతక్క కోడలు రూ.41 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఎల్ఎస్‌వైసీ అధ్యక్షుడు మల్లెల రణధీర్, ఉపాధ్యక్షుడు యాదగిరి కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొట్టె శ్రీనివాస్, కోశాధికారి హలావత్ సుమన్, సాంస్కృతిక కార్యదర్శి వజ్జ రాహుల్, కంగాల నాగేశ్వర రావు, ఇరుప రాజేశ్వర్, తుపాకుల పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే కార్మికుడి మృతి


కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

తొర్రూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే మునిసిపల్ కార్మికుడు షైదం మహేశ్ మృతి చెందాడని, అధికారులే బాధ్యత వహించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం తొర్రూరు మునిసిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి ధర్నా చేసి ఆయన మాట్లాడారు. వేతన బకాయి ఉందని, చెల్లించమని అధికారుల చుట్టూ తిరిగినా వేతనం చెల్లించలేదు. తోటి కార్మికులకు వేతనాలు అందించి మహేశ్‌కు వేతనం ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. మహేశ్ మృతికి కారణమైన మునిసిపల్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకన్న, రామస్వామి, సోమయ్య, రాంనర్సయ్య, శ్రీరాములు, ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లా
ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం ప్రకటించారు. మొత్తం 12 మండలాల నుంచి 30 మంది ఎంపిక కాగా వీరికి కలెక్టరేట్‌లో శనివారం అవార్డులు అందించనున్నారు. ఈ మేరకు డీఈవో రాజేందర్ వెల్లడించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో కె.అశోక్ (చెల్పూరు జీహెచ్ఎం), కల్పనకుమారి (జగ్గయ్యపేట జడ్పీహెచ్ఎస్), వలీ పాషా (మహదేవపూర్ జడ్పీహెచ్ఎస్), ప్రవీణ్ (మొగుళ్లపల్లి జడ్పీహెచ్ఎస్), రాజేంద్రప్రసాద్ (మొగుళ్లపల్లి జడ్పీహెచ్ఎస్), రాజేందర్ (కాళేశ్వరం జడ్పీహెచ్ఎస్), రాధ (చెల్పూరు జడ్పీహెచ్ఎస్), సుధాకర్ (నైన్‌పాక జడ్పీహెచ్ఎస్), కల్యాణి (మహదేవపూర్ ఎంపీపీఎస్), సదాకర్ (చెంచుపల్లి ఎంపీపీఎస్), సరస్వతి (తాడిచర్ల జడ్పీహెచ్ఎస్), సుజాత (కేజీబీవీ మల్హర్ రావు), శ్రీధర్ (నీలంపల్లి ఎంపీపీఎస్), రవీందర్ (నిమ్మగూడెం ఎంపీపీఎస్), సంధ్యారాణి (ఎడ్లపల్లి ఎంపీపీఎస్), ప్రకాష్‌బాబు (మహదేవపూర్ ఎంఈవో), పురుషోత్తం రెడ్డి (సూరారం జడ్పీహెచ్ఎస్), కృష్ణకుమారి (జడ్పీహెచ్ఎస్ రేగొండ), రామ్మూర్తి (ఎంపీయూపీఎస్ బెగ్లూర్), మానస (డీఎన్‌టీ గొల్లబుద్దారం), తిరుపతిరెడ్డి (చింతకాని జడ్పీహెచ్ఎస్), నరేష్ (టేకుమట్ల ఐఈఆర్‌పీ), శ్రీధర్ (కాటారం ఆర్‌పీ), వరప్రసాద్ (లిటిల్ ఆంగిల్ హెచ్ఎస్), రమాదేవి (ఎంజీఎం హెచ్ఎస్), జగ్గయ్య (ఫ్రోబెల్ హెచ్ఎస్), కృషిత (ఆదర్శ హెచ్ఎస్), సాయివాణి (కేంబ్రిడ్జి హెచ్ఎస్), వెంకటలక్ష్మి (శ్రీనేతాజీ స్కూల్) ఉన్నారు.

రేపు రామప్ప ఆలయం
ద్వార బంధనం

వెంకటాపూర్, సెప్టెంబరు 5, (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా సుప్రసిద్ధ యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపూర్‌లోని రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయంలో ద్వార బంధనాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఈవో బిల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 9:56 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించనున్న దృష్ట్యా మధ్యాహ్నం ఒంటి గంట వరకు పూజలను నిర్వహించి ఆలయం మూసివేస్తామన్నారు. గ్రహణ మోక్షానంతరం ఆలయాన్ని శుద్ధి సంప్రోక్షణధాకాలు చేసి తిరిగి సోమవారం ఉదయం 7 గంటలకు భక్తులకు దర్శనానికి, ఆర్జిత సేవలకు అవకాశం కల్పించనున్నట్లు ఈవో వివరించారు.

- 10న ఆలయంలో వేలంపాట

రామప్ప ఆలయంలో లడ్డూ, పులిహోర విక్రయానికి ఈనెల 10న బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డూ, పులిహోర 4 అక్టోబరు 2025 నుంచి ఏడాదిపాటు అమ్ముకొనేందుకు హక్కు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనేందుకు రూ లక్షా 50వేలు ధారవత్తు సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పశువుల సంతపై ప్రశంసలు
- నవాబుపేటను సందర్శించిన పిలిప్పీన్స్ దేశస్థులు


నవాబుపేట సంత నిర్వాహకులను కలిసిన ఫిలిప్పీన్స్ అధికారులు

లింగాలఘణపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పశువుల్లో సంక్రమించే వ్యాధుల నివారణకు అందుబాటులో ఉన్న వైద్యవిధానాలను పరిశీలించేందుకు ఫిలిప్పీన్స్ దేశానికి సంబంధించిన ప్రతినిధుల బృందం శుక్రవారం నవాబుపేట సంతను సందర్శించింది. బ్యూరో ఆఫ్ ఎనిమల్ ఇండస్ట్రీ(బీఏఐ) ఆధ్వర్యంలో ఫిలిప్పీన్స్ అధికారులు డాక్టర్ ఫ్రాన్సిస్, డాక్టర్ లోవెల్ పశువుల వ్యాపారులతో పాటుగా పశు పోషకులను కలిసి పశువుల పోషణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య పరిరక్షణ మెళకువలను తెలుసుకున్నారు. ఫిలిప్పీన్స్ అధికారులతో పాటుగా జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ మురళీధర్, ఆపెడా ఈజీఎం, పశుమాంస ఎగుమతిదారుల ఇండియా అధ్యక్షుడు అఫ్జల్ అజీజ్, డాక్టర్ దేవేందర్, డాక్టర్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

మనవడి మరణం తట్టుకోలేక.. ఆగిన నాయనమ్మ గుండె

- ఒకే కుటుంబంలో రెండు విషాదాలు
- కొన్ని గంటల వ్యవధిలోనే ఇద్దరు మృతి


నీలమ్మ

గోవిందరావుపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అల్లారు ముద్దుగా చూసుకున్న మనవడు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో తల్లడిల్లిపోయిన ఆ నాయనమ్మ గుండె ఆగిపోయింది. బాలుని అంత్యక్రియలు ముగిసిన గంటల వ్యవధిలోనే ఆమెకూడా కన్నుమూసింది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రాలో ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది. గోవిందరావుపేటలో గురువారం సాయంత్రం ఇసుక లారీ ఢీకొన్న సంఘటనలో కొప్పనాతి హర్షసాయి(4) మృతిచెందాడు. బాలుడి మరణంతో తీవ్ర మనోవేదనకు గురైన నాయనమ్మ నీలమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. రాత్రి బాలుడి మృతదేహానికి అంత్యక్రియలు జరిపించారు. చిన్నారి మనవడు దూరం కావడాన్ని తట్టుకోలేని ఆమె శుక్రవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో ఛాతీలో నొప్పితో కుప్పకూలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ములుగు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. ఒకే కుటుంబంలో గంటల వ్యవధిలో రెండు మరణాలు చోటుచేసుకోవడంతో పస్రాలో విషాదం అలుముకుంది.

కాంగ్రెస్ పాలనలోనే యూరియా కష్టాలు

- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- రైతులకు మద్దతుగా మొగుళ్లపల్లిలో నిరసన


ధర్నాలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి, సెప్టెంబరు05 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే రైతులకు యూరియాను అందించడం లేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. యూరియా కొరతపై రైతులకు మద్దతుగా భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సర్కారుకు సరైన ప్రణాళికలు లేకపోవడం వల్లే సమయానికి యూరియా అందడం లేదని దుయ్యబట్టారు. దీంతో రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. యూరియా ఇవ్వలేని ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఇబ్బందులను పట్టించుకోకుండా వారి పట్ల ముఖ్యమంత్రి నిర్లక్ష్యంగా మాట్లాడటం సరికాదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. అలాగే రాజకీయ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీబీపై విచారణ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేధింపులకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ విచారణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

జోరుగా మద్యం విక్రయాలు

ఎక్సైజ్ అధికారుల ఆంక్షలు గాలికి...

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులు మూసి ఉన్నాయనేది ఉత్తిత్తి మాటే.. పేరుకే లైసెన్స్డ్ షాపులకు అబ్కారీ అధికారులు సీల్ వేశారు.. కానీ మద్యం విక్రయాలు ఎక్కడా ఆగలేదు. గణపతి నిమజ్జనం నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలకు తావివ్వకూడదని, భక్తులు ఇబ్బందులకు గురికావొద్దనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులను మూసివేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో బార్, వైన్స్ షాపులకు అబ్కారీ అధికారులు సీల్ వేశారు. కానీ అక్రమంగా మద్యం విక్రయాలను నిలువరించడంలో చేతులెత్తేశారని పలువురు విమర్శిస్తున్నారు. కేవలం బార్, వైన్‌షాపుల తనిఖీలకే పరిమితం అవడంతో గ్రేటర్ వరంగల్ శివార్లతో పాటు వరంగల్ రూరల్‌లోని పల్లెల్లో మద్యం విక్రయాలు జోరుగా కొనసాగాయి. మద్యం బాబుల సందడితో బెల్ట్‌షాపులు బార్, వైన్స్ షాపులను తలిపించాయి. కొందరు అధికారుల ఆశీస్సులతో వైన్‌షాపుల నిర్వాహకులు వందలాది మద్యం పెట్టెలను బెల్ట్‌షాపులకు తరలించినట్లు తెలుస్తోంది. దీంతో ట్రైసిటీ చుట్టూరా ఉన్న గుండ్లసింగారం, చింతగట్టు, దేవన్నపేట, కోమటిపల్లి, భట్టుపల్లి, కడిపికొండ, కాజీపేట దర్గా, పైడిపల్లి, దేశాయిపేట, వడ్డెపల్లి, న్యూశాయంపేట, హనుమకొండ బస్టాండ్, భీమారం, హూరీగుట్ట, ధర్మారం, ఉనికిచర్ల, దేవన్నపేట, గోపాల్‌పూర్‌తో పాటు వరంగల్ రూరల్‌లోని పల్లెల్లో మద్యం విక్రయాలు జోరుగా ఊపందుకున్నాయి. ఒక్కో ఫుల్‌బాటిల్‌పై రూ.200 నుంచి 250 వరకు, బీరుపై రూ.70 అధికంగా తీసుకొని ఆయా బెల్ట్‌షాపుల నిర్వహించినట్లుగా సమాచారం.



ఘనంగా గణపతి నిమజ్జనోత్సవం

సిద్దేశ్వర గుండం వద్ద నిమజ్జనం చేస్తున్న బల్దియా సిబ్బంది, నిమజ్జనం అవుతున్న గణనాథులు

హనుమకొండ వాగ్దేవి కళాశాలలో నిమజ్జనానికి తరలుతున్న గణపతికి హారతి ఇస్తున్న విద్యార్థులు

వినాయక నిమజ్జనం కనులపండువగా సాగింది. తొమ్మిది రోజులు ఘనమైన పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడు.. డప్పు చప్పుళ్లు, కోలాటాలు, నృత్యాల నడుమ చెరువుల వద్దకు బయలుదేరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిమజ్జనోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

వరంగల్ చిన్న వడ్డెపల్లి చెరువులో గణపతి నిమజ్జనం దృశ్యాలు

పబ్లిక్ గార్డెన్ సమీపంలో మహిళల నృత్యాలు

హనుమకొండ సిద్దేశ్వర గుండం వద్ద..

నిట్‌లో ఇంజనీరింగ్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్

- రూ.13కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు
- బజాజ్ ఆటో లిమిటెడ్‌తో నిట్ ఎంవోయూ



ఎంవోయూపై పత్రాలతో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబుధి, బజాజ్ ఆటో లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ గుడిపాటి సుధాకర్

హనుమకొండ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): బజాజ్ ఆటో లిమిటెడ్‌తో వరంగల్ ఎన్ఐటీ శుక్రవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నది. ఈ భాగస్వామ్యం కింద బజాజ్ ఆటో లిమిటెడ్ తన సీఎస్ఆర్ నిధులు రూ.13కోట్లు వెచ్చింది వరంగల్ నిట్ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ స్కిల్ ట్రైనింగ్ (బీఈఎస్‌టీ) సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నది. ఇలా ఒప్పందం కుదుర్చుకున్న మొదటి కేంద్ర నిధుల సాంకేతిక విద్యాసంస్థ (సీఎఫ్‌టీఐ)గా వరంగల్ నిట్ నిలిచింది. ఈ ఎంవోయూపై వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి, బజాజ్ ఆటో లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ గుడిపాటి ఈ ఎంవోయూపై సంతకాలు చేశారు. నిట్ వరంగల్ బీఈఎస్‌టీ అధిపతి ప్రొఫెసర్ టి.కిశోర్ కుమార్, డీన్స్ విభాధి పతులు. అధ్యాపకులు, బజాజ్ ఆటో లిమిటెడ్ ప్రతినిధులు ఈ సందర్భంగా హాజరయ్యారు. బీఈఎస్‌టీ లక్ష్యం విద్య, శిక్షణ, పరిశ్రమల అవసరాల మధ్య గత అంతరాన్ని తగ్గించడం. ఈ ప్రాజెక్టు ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశా లు కలిగేలా నైపుణ్యాభివృద్ధి చేయనున్నారు.

బీఈఎస్‌టీ ప్రోగ్రాంను మొత్తం ఆరు విభాగాలుగా రూపొందించారు. వీటిలో మొదటి దశలో వరంగల్ నిట్‌లో ఫర్మ్‌వేర్ డెవలప్‌మెంట్, ఈ-మొబిలిటీ అనే రెండు విభాగాలను అమలు చేస్తారు. ఇవి ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ భవిష్యత్తుకు అత్యంత కీలకం. ఈ ప్రోగ్రాం ఇప్పటికే నిట్‌లోని బీటెక్ (ఈసీఈ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) కోర్సుల్లో ప్రారంభించారు.

ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులు నిట్, బజాజ్ ఆటో లిమిటెడ్ నుంచి సంయుక్తంగా సర్టిఫికెట్ పొందు తారు. అంతేకాకుండా ఈ ప్రత్యేక విభాగం కోసం అవసరమైన అన్ని పరికరాలు, ల్యాబ్ వంటి మౌలిక వసతులు బజాజ్ ఆటో లిమిటెడ్ పూర్తిగా కల్పిస్తుంది. దీంతో విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలతో శిక్షణ లభిస్తుంది. బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో త్వరలోనే ఇన్నోవేషన్, శిక్షణ, అప్లయిడ్ రిసెర్చ్ హబ్‌గా ఎదుగనున్నది. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ ఉన్నత విద్యాకార్యదర్శి మార్గదర్శకత్వంలో బీఈఎస్‌టీ ప్రోగ్రాం ప్రారంభించిన మొదటి నిట్ వరంగలేనని అన్నారు. విద్యాబోధన, పారిశ్రామిక రంగంలో వేగంగా మారుతున్న వాస్తవ అను వర్తనాల మధ్య గల అంతరాన్ని తగ్గించడంలో ఈ ప్రోగ్రాం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

బజాజ్ ఆటో లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ గుడిపాటి మాట్లాడుతూ.. అకాడెమియా భాగస్వా మ్యాన్ని బలపరచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థులను భవిష్యత్తుకు తగిన ఇంజనీర్లుగా తీర్చిదిద్దడంలో ఇది దోహదం చేస్తుందన్నారు. అంతేగాక పూర్తిస్థాయి నిధులతో మౌలిక వసతు లు, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, సర్టిఫికేషన్ మార్గాలు అందించడంలో బజాజ్ దీర్ఘకాలిక కట్టుబాటును పునరుద్ఘాటించారు.



కేయూ స్టాల్ వివరాలను వింటున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, ఇతర అధికారులు

సీఎం దృష్టిని ఆకర్షించిన కేయూ స్టాల్

'వేస్ట్ టూ వెల్త్' వివరాలపై రేవంత్‌రెడ్డి ఆరా

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శిల్పాకళా వేదిక సాక్షిగా కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన స్టాల్.. సీఎం రేవంత్ రెడ్డి దృష్టిని ఆకర్షించింది. కేయూ సెరికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత నేతృత్వంలో రూపొందించిన 'వేస్ట్ టూ వెల్త్' ప్రాజెక్టును సీఎం ఆసక్తిగా పరిశీలించారు. వేస్ట్‌ను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అనే అంశాన్ని సంబంధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత, ఇతర అధికారులు రాము బన్నుర్కర్, ఎం.ప్రవీణ్‌లు సీఎం రేవంత్‌కు వివరించారు. ప్రాజెక్టు బాగుందని కితాబుచ్చారు. అలాగే ఇటీవల తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను సక్సెస్ చేశారని, గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను మరింత సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తున్నారని అభినందనలు తెలిపారు. వెల్ డన్.. వెల్ డన్.. అంటూ వర్సిటీ అధికారులను అభినందించారు.



జీపీఓలు వెళుతున్న బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హైదరాబాద్‌కు తరలిన జీపీవోలు

జెండా ఊపి బస్సులను ప్రారంభించిన అదనపు కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు సంబంధించిన గ్రామ పంచాయతీ పాలన అధికారులు (జీపీవోలు) నియామక పత్రాలు సీఎం రేవంత్‌రెడ్డి చేతలు మీదుగా అందుకునేందుకు శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం నుంచి జీపీవోల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాకు సంబంధించి 110 మంది జీపీవోలు మూడు బస్సుల్లో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ పరిపాలనాధికారి గౌరీశంకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏక్లవ్య ద్వారా అందుబాటులోకి ప్రపంచస్థాయి విద్య

- విద్యార్థుల అభ్యసన పునాదుల పటిష్టతకు దోహదకారి
- ఏక్లవ్య ఓటీటీ ప్లాట్‌ఫారం చైర్మన్ సంతోష్ రెడ్డి
- ఘనంగా ఓటీటీ ప్లాట్ ఫారం ప్రారంభం



ఏక్లవ్య ఓటీటీ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

హనుమకొండ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఎడ్యుకేషన్ టెక్నాలజీ కంపెనీ ఏక్లవ్య ఓటీటీ ప్లాట్‌ఫారాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ఏక్లవ్య చైర్మన్ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు అత్యుత్తమ ఉపాధ్యాయుల శ్రేణి, వనరులు కొన్ని నగరాల్లోనే కేంద్రీకృతమయ్యాయని, దీనిని తాము మార్చుతున్నామ న్నారు. ఏక్లవ్య ద్వారా కేవలం తరగతులే కాకుండా ఎంపిక, అవకాశం, ప్రపంచస్థాయి విద్య దేశం నలుమూలలా అందిస్తుందని, అధ్యయనం మధ్య అంతరాలను తొలగిస్తుందన్నారు. సంప్రదాయ నమూనా మాదిరిగా ఏక్లవ్య విద్యార్థులను ఒకే గ్రేడ్‌లో బంధించదని, విద్యార్థుల అభ్యసన పునాదులను బలపరుస్తుందని చెప్పారు. ఏకలవ్య సహ వ్యవస్థాపకుడు, సీఈవో దీపక్ మాట్లాడుతూ.. అధ్యయనాల మధ్య అంతరాలే విద్యార్థులు ఉన్నత స్థాయి భావనలను అర్థం చేసుకోలేకపోవడానికి కారణం అన్నారు. దీనికి తాము పరిష్కారం కనుకొన్నామని, తాము పేస్ బేస్డ్ సిస్టమ్ నుంచి మాస్టరీ బేస్డ్ సిస్టమ్ వైపు అడుగుపెడుతున్నామన్నారు.

ఏక్లవ్య డైరెక్టర్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి అత్యుత్తమ బోధన అనివార్యం అన్నారు. విద్యార్థులు అత్యుత్తమ ఉపాధ్యాయుల వద్ద విద్య నేర్చుకునేందుకు వీలుగా తాము ఈ ఓటీటీ ప్లాట్‌ఫారంను నిర్మించామన్నారు. ఎస్ఆర్ అకాడమీ జీఎం, ఏక్లవ్య డైరెక్టర్ పెండెం వెంకట నగేశ్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. ఒక గొప్ప పాఠం కూడా నాసిరకం ప్రజంటేషన్ వల్ల ప్రభావం కోల్పోతుందని అన్నారు. అందుకే లర్నింగ్‌కు సంబంధించిన ప్రతీ వీడియో సినిమా స్థాయి క్వాలిటీ ప్రొడక్షన్‌ను కలిగి ఉంటుందన్నారు. డైరెక్టర్ అజయ్ కుమార్ కొండపర్తి మాట్లాడుతూ.. వీడియోలో ప్రతీ క్షణం కంటెంట్ ప్రయోజనకరంగా, పాఠ్యపరంగా సరైనదిగా, ఆకట్టుకునేలా రూపొందించామని తెలిపారు. భారత నౌకాదళం మాజీ అధికారి సీటీవో కమాండర్ అనుమాండ్ల నటరాజు మాట్లాడుతూ.. తమ టెక్నాలజీ స్థిరమైంది, సురక్షితమైందని తెలిపారు. బఫరింగ్ లేకుండా సాఫీగా నడిచే వీడియో కోసం ఆధునాతన సాంకేతికతను వాడామన్నారు.

దేశంలోనే మొదటి ఓటీటీ ప్లాట్ ఫారం

ఒకే సబ్‌స్క్రిప్షన్‌తో టైమ్, ఆహా గురు వంటి అగ్రశ్రేణి విద్యా బ్రాండ్లను ఒకే సబ్‌స్క్రిప్షన్‌లో అందించి ప్రతీ విద్యార్థికి నాణ్యమైన, సరసమైన విద్య అందిస్తుంది. విద్యార్థులు తమ లర్నింగ్ జర్నీని స్వయంగా నియంత్రించుకొని, లర్నింగ్‌లోని అంతరాలను తొలగించుకొని తమ పూర్తి విద్యాసామర్థ్యాన్ని పెంచుకోవడానికి దోహదపడుతుంది. భారతీయ విద్యలోని ప్రధాన సవాళ్లకు, సమస్యలకు ప్రత్యక్ష సమాధానం ఇస్తుంది. మహానగరం మొదలు కుగ్రామం వరకు అగ్రశ్రేణి విద్యను ఇంటింటికీ అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీ ప్రొ చాన్సలర్ మధుకర్ రెడ్డి, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడారం అడవుల్లో దారుణ హత్య

- యువకుడిని కిడ్నాప్ చేసి చంపిన దుండగులు
- ఆపై మృతదేహం దహనం
- పోలీసుల అదుపులో నిందితులు?



మృతుడు బాసిత్ (ఫైల్)

తాడ్వాయి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం అడవుల్లో దారుణం చోటుచేసుకుంది. ఓ యువకుడిని పలువురు కిడ్నాప్ చేసి హత్య చేశారు. ఆపై మృతదేహాన్ని కాల్చి పడేసి వెళ్లారు. ఈ సంఘటన గురువారం వెలుగు చూసింది. మేడారం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడారానికి రెండు కిలో మీటర్ల దూరంలో గుర్తు తెలియని మృతదేహం ఉందని పలువురు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి తమ సిబ్బందితో ఎస్సై అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలింగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఎం.డి.బాసిత్ (20) అనే యువకుడిదిగా గుర్తించారు. ఈనెల 3న భూపాలపల్లి నుంచి బాసిత్ కిడ్నాప్‌నకు గురికాగా కేసు నమోదైంది. బాసిత్‌ను భూపాలపల్లికే చెందిన బబ్లూ, ప్రశాంత్, కుషాల్‌తోపాటు మరికొందరు శాంతినగర్‌లోని చర్చి వద్ద నుంచి కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని అతడి తల్లి సబిహా అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఈ క్రమంలో బాసిత్‌ను కిడ్నాపర్లు హత్య చేసి మేడారం అడవుల్లో మృతదేహాన్ని కాల్చి పడిసినట్టు పోలీసుల విచారణలో తేలింది. మృతుడి రెండు చేతులను తాడుతో వెనక్కి కట్టేసి ఉన్నాయి. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని మార్చురీకి తరలించిన పోలీసులు నిందితులు బబ్లూ, ప్రశాంత్, కుషాల్‌ను అదుపులోకి తీసుకున్నారని సమాచారం. గంజాయి రవాణా ఆర్థిక లావాదేవీల విషయంలో ఘర్షణ చోటుచేసుకోవడమే ఈ హత్యకు కారణమని తెలుస్తోంది. మరోవైపు ఓ యువతికి బాసిత్ ఇన్‌స్టాగ్రామ్‌లో మేసేజ్‌లు పంపడం వల్లే ఈ హత్య జరిగిందని కూడా చర్చ జరుగుతోంది. బాసిత్‌ను తామే హత్య చేశామని నిందితులు బబ్లూ, ప్రశాంత్, కుషాల్ అంగీకరించారని సమాచారం. సంఘటన స్థలాన్ని భూపాలపల్లి సీఐ నరేష్, ఎస్సై సాంబ మూర్తి సందర్శించి విచారణ చేపడుతున్నా రని మేడారం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు వెల్లడించారు.


మహబూబాబాద్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం బాధ్యులు


మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, డీఈవో దక్షిణమూర్తి


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలు : కలెక్టర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని, విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశకులని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య రూపుదిద్దుకుంటుందని తెలిపారు. మహబూబాబాద్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశహాల్‌లో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణమూర్తి నేతృత్వంలో ఉపాధ్యాయ దినోత్సవం (గురుపూజోత్సవం)ను నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 12 మందిని శాలువాలు కప్పి, మెమొంటోలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు హాజరుకాగా, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జ్యోతి ప్రజ్వళన చేసి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడు నిత్యవిద్యార్థిగా నూతన సాంకేతికతను అలవర్చుకొని పాఠశాలల్లో విద్యార్థులకు బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయుల సమిష్టి కృషితోనే ఎస్సెస్సీ ఫలితాల్లో రాష్ట్రంలోని మానుకోట జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, ఆ స్థానాన్ని కాపాడుకోవడానికి ఉపాధ్యాయులు నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రులు జన్మనిస్తే... ఉపాధ్యాయులు భవిష్యత్తునిస్తారు అని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. విద్యార్థి పాఠశాలలో ప్రవేశం పొందిన నాటి నుంచి ఎక్కువగా ఉపాధ్యాయుల కనుసన్నల్లోనే ఉంటారని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత అని ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయుడు గురువు మాత్రమే కాదని మార్గనిర్దేశకుడని, ప్రేరణదాత అని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎస్.శ్రీనివాసరావు, టి.హరీష్, కె.శ్రావణ్‌కుమార్, పి. ాశినాథ్, పి.నవీన్, ఎంఎ అన్‌జుం సుల్తానా, కె.నాగరాజు, బి.రమేష్, గోపినాథ్, కుమారస్వామి, రవీందర్, సబితను సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు మందుల శ్రీరాములు, అప్పారావు, ఆజాద్, పూర్ణచందర్, ఉమామహేశ్వర్, సతీష్, శ్రీనివాస్, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా జేఏసీ చైర్మన్ వడ్డెబోయిన శ్రీనివాస్ విద్యాబుద్దులు నేర్పిన శంకరయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు మైస నాగయ్య, సోమయ్య, ఉపేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని ఏకశిలా హైస్కూల్‌లో రోటరీ క్లబ్ క్లబ్ ఉపాధ్యక్షుడు కల్లెం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు శంతన్‌రామరాజు, వద్దుల సురేందర్‌రెడ్డి, బిక్కి వెంకటేశ్వర్లు, కొడారి నాగేందర్, గిరిదర్‌గుప్తా, జంగాల నర్సింరావు, లక్ష్మీనర్సింహరావు, శివకుమార్, మహిపాల్‌రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

● పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో 35 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శంతన్‌రామరాజు, బిక్షపతి, శ్యామల్‌రావు, వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ఉప్పలయ్య, వీరయ్య, సులోచన, స్నేహబిందు పాల్గొన్నారు.

● పట్టణంలో రిటైర్డ్ డిగ్రీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గోపు సమ్మయ్యను మాఅసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేందర్ సన్మానించి పాదాభివందనం చేశారు.

● జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువులు పొక్కుల సదానందం, బందెల రాజు, తాళ్లపల్లి యాకమ్మ,రాగం వీరభద్రం, సజ్జనం వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు వెంకట్‌రెడ్డి, మైస నాగయ్య, పట్టాభి లక్ష్మయ్య, విష్ణువర్ధన్, మైస శ్రీనివాసులు, పెద్ది వెంకన్న, పరమాత్మాచారి, కోట సుధాకర్, మదుసూదన్‌రావు, రామకృష్ణారావు, దేవేందర్‌రెడ్డి, బూర్ల ప్రభాకర్, వెంకట్, దేవ్‌సింగ్, రమేష్, నరసింహరావు, శ్రీహరి, రాజన్న, వీరస్వామి, పగడయ్య, ఉపేందర్, బిక్షం, రవీందర్, వీరేందర్, వెంకటేశ్వర్లు, రవి, నాగరాజు, జగదీష్, భద్రునాయక్, మల్లేష్, రాజు, రాంబాబు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త సూచించిన శాంతిమార్గాన్ని అనుసరించాలి

• మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ ఫరీద్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త సూచించిన శాంతి మార్గాన్ని అనుసరించాలని మహబూబాబాద్ మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ ఎమ్డీ ఫరీద్ అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్ ఉన్‌నబీ పర్వదిన వేడుకలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త సూచించిన శాంతి, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, మానవత్వాన్ని ఎదుటి వారి పట్ల చూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఆహ్మద్ రిజ్వీ, ఆసిప్ అలీ, రఫిక్, ముజ్బుల్, సాజిర్, ఇమ్రాన్, ఫయజ్, జాకిర్, అస్లం, మోహసిన్, సయిద్, తబ్రిజ్ పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


డోర్నకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

డోర్నకల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని డోర్నకల్‌లో ముస్లింలు శుక్రవారం మస్జీద్‌లో ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం డోర్నకల్ మెయిన్‌రోడ్డు మీదుగా పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డోర్నకల్ సీఐ చంద్రమౌళి సిబ్బందితో కలిసి ర్యాలీ వెంట ఉండి బందోబస్తు నిర్వహించారు. పెషిమామ్ సుల్తాన్, సలీంపాషా, ఖాదర్‌బాబా, అఖిలుల్లా, జమీల్, హఫీజ్, గౌస్‌పాషా, నవాబ్, ముస్లీంలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మానుకోట స్వాగత వేదికపై ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, అధికారులు


మహబూబాబాద్‌లో నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్తున్న వినాయక విగ్రహాలు


ఇనుగుర్తిలోని చెరువు ఘాట్ వద్ద వినాయక నిమజ్జనం పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

బైబై గణేషా

(5వ పేజీ తరువాయి)

నిమజ్జనం చేశారు. మానుకోట డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దారి పొడవునా పోలీస్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తూ విగ్రహాలను నిజాం చెరువు వద్దకు పంపించారు.

వివిధ మండలాల్లో..

● గూడూరు : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను గూడూరు పాకాల వాగులో నిమజ్జనం చేశారు. అరవింద విద్యాలయంలో నిర్వహించిన నిమజ్జన వేడుకలకు సీఐ సూర్యప్రకాష్, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కాల్సాని శ్రీనివాసరెడ్డి, కరస్పాండెంట్ పింగిళి శ్రీనివాస్ పాల్గొన్నారు. పాకాలవాగు వద్ద ఎస్సై గిరిధర్‌రెడ్డి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● చిన్నగూడూరు : మండలంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను భక్తులు ఉగ్గంపల్లి ఆకేరువాగులో నిమజ్జనం చేశారు.

● మరిపెడ : మరిపెడ మాకుల చెరువు వద్ద వినాయక ఘట్‌ను ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్ కేకన్ పరిశీలించారు. మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని పురుషోత్తమయగూడెం ఆకేరు వాగులో నిమజ్జనం చేశారు.

● దంతాలపల్లి : దంతాలపల్లి మండల కేంద్రంతో పాటు దాట్ల, పెద్దముప్పారం, బీరిశెట్టిగూడెం, బొడ్లాడ గ్రామాల్లోని వినాయక విగ్రహాలను సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.

● పెద్దవంగర : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆయా చెరువుల్లో నిమజ్జనం చేశారు.

● తొర్రూరు: పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను తొర్రూరు పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

● బయ్యారం : మండల కేంద్రంలోని రామాలయం, కోటి, గాంధీసెంటర్, బొడ్రాయిబజార్, తాటిబజార్‌లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను వఅలిగేరులో, పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

● డోర్నకల్ : మునిసిపల్ కేంద్రంలోని బతుకమ్మ చెరువువద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, సీఐ చంద్రమౌళి, మునిసిపల్, రెవెన్యూ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించారు.

● కొత్తగూడ : కొత్తగూడ మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను చెరువుల్లో, వాగుల్లో నిమజ్జనం చేశారు. కొత్తగూడలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలంలో మంత్రి సీతక్క కోడలు కుసుమాంజలి రూ.41 వేలకు దక్కించుకున్నారు.

● నెల్లికుదురు : మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను చెరువుల్లో, వాగుల్లో నిమజ్జనం చేశారు.

● ఇనుగుర్తి మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను చెరువుల్లో, వాగుల్లో నిమజ్జనం చేశారు. పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు.

● కేసముద్రం ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్, వరసిద్ధివినాయక, అమీనాపురం, కల్వల, ఉప్పరపల్లి, కేసముద్రంతో పాటు వినాయక నిమజ్జనాలను ఆయా గ్రామాల్లో చెరువుల్లో నిమజ్జనం చేశారు.

● కురవి మండలంలో ఏర్పాటు చేసిన 120 వినాయక విగ్రహలు, సీరోలు మండలంలో ఏర్పాటు చేసిన 90కి పైగా విగ్రహాలను చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జన బందోబస్తును కురవి ఎస్సై గండ్రాతి సతీష్, సీరోలు ఎస్సై సంతోషలు పర్యవేక్షించారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కుట్ర


ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు చిత్రపటాలను దహనం చేస్తున్న నాయకులు

పెద్దవంగర, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ జాబిత నుంచి లంబాడీలను తొలగించాలని ఇటీవల సుప్రీం కోర్టులో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావుతో పిటిషన్ వేయించడం లంబాడీల మనోభావాలను దెబ్బ తీయడమే కాకుండా బంజారా జాతి మధ్య చిచ్చు పెట్టా రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితమైన కుట్రలకు తెరలేపిందని లంబాడి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు బానోతు మహేందర్‌నాయక్, భూక్య శ్రీనునాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఎస్టీల రిజర్వేషను ఆర్టికల్ 342 ప్రకారమే లంబాడీలను ఎస్టీ జాబితో చేర్చారని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు తప్పుడు ఆరోపణలు చేస్తూ లంబాడీల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లంబాడీల కోయ జాతుల మధ్య విద్వేషాలు సృష్టించి రాజకీయ పబ్బంతో లబ్ధి పొందాలని చూస్తున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు, మాజీ ఎంపీ సోయం బాబురావులను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్‌చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడి సంఘాల ఐక్యవేదిక నాయకులు వెంకట్‌నాయక్, సురేశ్‌నాయక్, నాగరాజునాయక్, గుగులోతు పటేల్‌నాయక్, రమేశ్, శంకర్‌నాయక్, వెంకన్ననాయక్, రాజేందర్‌నాయక్, భీమానాయక్, బాలునాయక్, సీతారామ్‌నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించాలి

● డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్


రైతులకు యూరియా అందించాలని రైతులతో కలిసి ధర్నా చేస్తున్న వివేక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులకు తక్షణమే యూరియా అందించాలని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో శుక్రవారం రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పట్ల కేంద్రప్రభుత్వ మొండి వైఖరివిడనాడి తక్షణమే రైతులకు యూరియా అందించాలన్నారు. నెల రోజులుగా రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. యూరియా సెంటర్లపై వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం ఉందని, అందువల్లనే బ్లాక్ మార్కెట్ దందా నడుస్తుందన్నారు. ఇప్పటికైనా యూరియాను రైతులకు అందించాలని, లేని పక్షంలో బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శాంతికుమార్, బుర్ర వీరభద్రం, కేలోతు సాయికుమార్, గుగులోతు సూర్యప్రకాష్, ఎర్ర దిలీప్, దేవేందర్, రామ్‌చరణ్, శివవర్మ పాల్గొన్నారు.


గార్ల జైన్ మందిరంలో దశలక్షణ మహాపర్వం పూజలు నిర్వహిస్తున్న మహిళలు

వైభవంగా దశలక్షణ మహాపర్వం పూజలు

గార్ల సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవించు, బతికించు, జీవహింస మహాపాపం అంటూ జైన్ మందిరంలో గత పది రోజులుగా మహిళలు దశలక్షణ మహాపర్వం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మహిళలు ఉదయాన్నే జైన్ మందిరంకు చేరుకొని జైన్ మహారాజ్ గురువుకు ప్రత్యేకంగా దైప దశిమి వేడుక పండుగను కన్నుల పండువగా జరుకుంటున్నారు. జైనులు పది దర్మాలను అచరిస్తూ కఠిన నియమ నిష్టలతో ఉపవాసాలు పాటించి భగవంతున్ని భక్తి పూజలు నిర్వహించడం జరిగింది. పతి రోజు ప్రత్యేకంగా దూప దశిమి పండుగను ఘనం జరుపుకున్నారు. అహింస ఆత్మశుద్ధి ధర్మా చరణ వంటి విలువలను జైన్ మత పెద్దలు బోధిస్తూ పూజలను వైభవంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో జైన్ మత పెద్దలు మహావీర్ జైన్, మహేందర్ జైన్, విమల్ జైన్, అకాశ్‌జైన్, వినోద్ జైన్ నితిన్‌జైన్, అనంద్‌జైన్, పలువురు జైన్ మహిళలు పాల్గొన్నారు.

లండన్‌లో హరీశ్‌రావును కలిసిన మానుకోట వాసి


లండన్‌లో హరీశ్‌రావుతో అబ్దుల్‌ఖుదూస్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : లండన్‌లో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును మహబూబాబాద్‌కు చెందిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యూనైటెడ్ కింగ్‌డమ్ యువజన విభాగం కోఆర్డినేటర్, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ- యూకే నాయకుడు ఎమ్డీ. అబ్దుల్ ఖుదూస్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. లండన్‌లో శుక్రవారం మీట్‌గ్రేట్ కార్యక్రమంలో భాగంగా హరీశ్‌రావుతో ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ సెల్ యూకే కమిటీ బాధ్యులు కలిసి పలు అంశాలపై చర్చించారు. ఎన్నారైలు స్వస్థలం అభివృద్ధికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారని ఎమ్డీ. అబ్దుల్ ఖుదూస్ మాజీ మంత్రికి తెలిపారు. ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ సెల్ యూకే అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, హరిగౌడ్, రవి, రత్నాకర్, అశోక్, చంద్రశేఖర్, జెల్లా శ్రీకాంత్, గణేష్ పాల్గొన్నారు.

9 నుంచి మిర్చి కొనుగోళ్లు

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల 9 నుంచి మిర్చి కొనుగోళ్లు పునఃప్రారంభిస్తున్నట్లు మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సౌకర్యార్థం కోల్డ్‌స్టోరేజీలో నిల్వ ఉంచిన మిర్చిని రెండు బస్తాల శాంపిల్స్‌ను మార్కెట్‌కు ఉదయం 9.30 గంటల్లోపే తీసుకువస్తే మార్కెట్‌లో ఈ నామ్ పద్ధతిలో వేలం పాటలు నిర్వహిస్తారని చెప్పారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం మాత్రమే ఈ మిర్చి కొనుగోళ్లు జరుగుతాయని, కోల్డ్ స్టోరేజ్‌ల వద్ద అమ్మకుండా నేరుగా మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముకుంటే ధర లభిస్తుందన్నారు.

యూరియా విక్రయాల్లో వ్యాపారుల దగా..!?

(5వ పేజీ తరువాయి)

తెలిసింది. ఓ పక్క పంట అదునుతప్పుతుంటే.. మరో పక్క వ్యాపారులు భేదాభిప్రాయులు వ్యక్తం చేయటంపై రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలో సక్రమంగా యూరియా పంపణీ జరిగేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఏవో రాంజీనాయక్‌ను వివరణ కోరగా.. ఫర్టిలైజర్ షాపు వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్న విషయాన్ని పలువురు రైతులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

డోర్నకల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్‌లోని సెయింట్ ఆగ్నేస్‌లో సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకుని గురుపూజోత్సవం నిర్వహించారు. పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎలెన్‌రాణి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ముఖ్యభూమిక పోషించేది ఉపాధ్యాయులేనని చెప్పారు.

సేవాలాల్ మందిరం నిర్మాణ కమిటీ ఎన్నిక


దస్రూనాయక్ అధ్యక్షుడు

కేసముద్రం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలంలో సేవాలాల్ మందిరం, ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి నూతన కమిటీని స్థానిక లక్ష్మిసాయి గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షునిగా గుగులోత్ దస్రూనాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ వెంకన్న, ఉపాధ్యక్షులుగా ధరావత్ బాలునాయక్, గుగులోత్ వీరునాయక్, వాంకుడోత్ రవి, హూస్సేన్, రాము, కోశాధికారిగా బానోత్ కీమ్యా ఎన్నుకున్నారు.

మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

నెల్లికుదురు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వస్తువులపై జీఎస్టీ తగ్గించడం పట్ల మండల కేంద్రంలోని అంబేద్కర్‌సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు చందు రాజుకుమార్ మాట్లాడుతూ, హెల్త్ ఇన్‌రెన్స్ ఆటోమొబైల్ ఎలాక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో మధ్యతరగతి కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాస యాకిరెడ్డి, జటోత్ యుగేందర్, శివసాయి, సలుగు ప్రవీణ్, గుగులోత్ సుధాకర్, జిలుకర యాకన్న, గోపగానిశ్రీను, కనుకుట్ల శ్రీకాంత్, సాగర్ పాల్గొన్నారు.

గుంతల రోడ్లపై మినీగూడ్స్ డ్రైవర్ల నిరసన

కేసముద్రం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం ఎంసీపీఐ (యూ) పార్టీ అనుబంధ రాణి రుద్రమదేవి మినీ గూడ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రాలీ ఆటో డ్రైవర్లు అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ అంబేద్కర్ సెంటర్ నుంచి విలేజి దర్గా వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. గుంతల కారణంగా తమ వాహనాలు చెడిపోతున్నాయన్నారు.యూనియన్ బాధ్యులు అజ్మీర రమేష్, బండి సంతోష్, కాసు సాయి, బానోత్ యాకూబ్, కడారి సాగర్, బానాల రఘు, ఎండి.అమీర్, కొమ్ము నరేష్, శ్రవణ్, బొజ్యా పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలి

మరిపెడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియాను సరఫరా చేయాలని లేనట్లయితే సీపీఎం ఆధ్వర్యంలో యూరియా ఉద్యమం తప్పదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అల్వాల వీరన్న హెచ్చరించారు. శుక్రవారం ఆయన మరిపెడ మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశం ఆ పార్టీ స్థానిక నేతలు మధుసూదన్, బాణాల రాజన్న, కందాల రమేష్, బోడపట్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్లు జీపీవోలుగా ఎంపిక

మరిపెడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపల్ ఆఫీస్‌లో పని చేస్తున్న పలువురు వార్డు ఆఫీసర్లు జీపీవోలుగా ఎంపికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియమాక ఉత్తర్వులు అందుకున్నారు. మరిపెడ వార్డు ఆఫీసర్లు గుర్రాల రాము, టేకుల అనిల్, మంగీలాల్, రవి, జ్యోష్న, శ్రీకాంత్, ప్రభాకర్ గ్రామ పాలన అధికారులుగా ఉత్తర్వులు పొందారు.

సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లకు రూ. 5వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, హెల్త్ కార్డు మంజూరు చేయాలని, రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి భూక్య లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు బంద్‌కు పిలుపునిచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు ఆదేశాల మేరకు కొత్తగూడలో రేషన్ డీలర్లు బంద్ పాటించారు. రేషన్ డీలర్లు వాసం నాగయ్య, అల్లెం జంపయ్య, వజ్జ రవికుమార్ పాల్గొన్నారు.